ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు



కంచికచర్ల మండలం కీసరలో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

కంచికచర్ల: కీసర మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన తెలంగాణలోని ఖమ్మం, వైరా, మధిర ప్రాంతాల్లో ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో బుధవారం కీసర మునేరుకు భారీగా వరదనీరు చేరింది.

పొంగుతున్న లక్ష్మయ్య వాగు...

మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెవిటికల్లు లక్ష్మయ్య వాగు పొంగిపొర్లుతోంది. పంట పొలాల్లోని వర్షపునీరంతా వాగుకు చేరడంతో రెండు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయని స్థానికులు తెలియజేశారు. చిన్నపాటి వర్షం కురిసినా వాగులు పొంగుతున్నాయని కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా కట్టలేరు

నందిగామ రూరల్: మండలంలోని దాములూరు కూడలి వద్ద వైరా కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాలకు తోడు ఎగువ నుంచి భారీగా వస్తున్న వరదతో వైరా కట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సురేష్‌బాబు అక్కడకు వెళ్లి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైరా కట్టలేరు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో ముందుజాగ్రత్త చర్యగా నందిగామ–వీరులపాడు మండలాల మధ్య రాకపోకలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. వరద ఉధృతి అధికంగా ఉండటంతో చేపలు పట్టేందుకు, ఈత కొట్టేందుకు వెళ్లొద్దని ప్రజలకు సూచించారు. వైరా కట్టలేరు వద్ద రాకపోకలు సాగించకుండా ప్రత్యేకంగా సిబ్బందిని కాపలాగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట వీఆర్వో సునంద, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



చెటికల్లులో వరదనీటితో పారుతున్న లక్ష్మయ్య వాగు



దాములూరు కూడలి వద్ద వైరా కట్టలేరు వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్‌బాబు

వరదలకు కొట్టుకుపోయిన మట్టికట్టలు

- రైతులకు భారీ నష్టం
- తీవ్ర ఆవేదనలో రైతులు



ముచ్చింతాలలో వరదకు కొట్టుకుపోతున్న మట్టి కట్ట

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): భారీ వర్షానికి వాగు పోటెత్తి వరద నీరంతా పొలంపై ప్రవహించటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ నెలలో మునేరుకు వచ్చిన భారీ వరదతో తువ్వకాలువకు గండ్లు పడి వరద నీరంతా వేమవరం, పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, అనిగండ్లపాడు మీదుగా పంట పొలాలన్నీ ముంచెత్తాయి. పంటపొలాలకు కోతకు గురికావడంతోపాటు ఇసుక మేట వేశాయి. కొన్ని పొలాలు రైతులు స్వంతగా డబ్బులు పెట్టి బాగు చేసుకోగా, కొన్ని పొలాలు ఇంకా అలానే ఉన్నాయి. మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీవర్షంతో వాగులు పొంగి తిరిగి పొలాలపై ప్రవహిస్తుండటంతోపాటు బాగు చేసుకున్న పొలాలు, మట్టి కట్టలు కొట్టుకుపోయాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు.

రూ.5లక్షలు పెట్టి బాగు చేయించుకున్నాం..



గతేడాది వచ్చిన వరదలకు ఎకరం పొలమంతా ఇసుక మేట వేయడంతోపాటు కోతకు గురైంది. ఈ ఖరీఫ్‌కు అయినా సాగు చేసుకుందామని దాదాపు రూ.5 లక్షలు పెట్టి పొలానికి కట్ట వేసుకోవడంతోపాటు ఇసుక మేట తీయించి గుంత పూడ్చాం. ఈ వరదకు కట్టంతా కొట్టుకుపోయింది. వరద తగ్గితే పొలం ఎలా ఉందో చూడాలి.

మగినం కుమారి, ముచ్చింతాల

ఇసుక మేట అలానే ఉంది.



గతేడాది వరదకు పొలంలో పెద్ద గుంత పడింది. ఇసుక మేట కూడా అలానే ఉంది. మరలా ఇప్పుడు వాగులు పొంగి పొలం మీదుగా వరద పారుతుండటంతో ఏమిచేయాలో అర్థంకావటం లేదు. వరదల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నాం. పొలాన్ని బాగుచేయాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

నర్సమ్మ, ముచ్చింతాల

ఇంకెన్నాళ్లీ బాధలు



మక్కపేట అండర్‌పాస్ వద్ద నిలిచిన వర్షపు నీటిలో వాహనాల పరిస్థితి

మక్కపేట(వత్సవాయి): మక్కపేట నుంచి పెనుగంచిప్రోలు వెళ్లే రహదారిలోఉన్న రైల్వేట్రాక్ అండర్‌పాస్ వద్ద వర్షాల సమయంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అండర్‌పాస్ వద్ద రహదారి పల్లంగా ఉండటంతో వర్షాలు పడినప్పుడు వర్షపునీరంతా అక్కడే నిలబడుతోంది. వర్షపు నీరు పోయే మార్గం లేకపోవడంతో వారం రోజుల వరకు నీరు అక్కడే నిలుస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి నిత్యం వేలాదిగా తరలి వచ్చే భక్తులు ఈ అండర్‌పాసు వద్ద మోకాళ్లలోతు నీటిలో వెళ్లాలంటే ఇబ్బందిపడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కొన్నేళ్లుగా వర్షాల సమయంలో ఎదురవుతున్న ఈ సమస్య పరిష్కారానికి అటు ఆర్అండ్‌బీ, ఇటు రైల్వేశాఖ అధికారులెవ్వరూ తగిన చర్యలు తీసుకోకపోతుండటంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా పాలకులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోతులను పూడ్పించండి సారూ!



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వర్షపునీటితో నిండిన గుంతలు

జగ్గయ్యపేటఅర్బన్: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు జగ్గయ్యపేట తహసీల్దార్ ఆవరణలోని గోతుల్లో భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో కార్యాలయానికి వచ్చే సందర్శకులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికే కార్యాలయ ఆవరణలోని 70శాతం స్థలం ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఇసుక డంప్‌లతో నిండిపోగా, మిగిలిన ప్రాంతం వర్షపునీటితో దర్శనమిస్తోంది. ఇకనైనా తహసీల్దార్ స్పందించి కార్యాలయ ఆవరణలోని గుంతలను పూడ్పించాలని ప్రజలు కోరుతున్నారు.

హామీల అమలులో కూటమి విఫలం



'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

నందిగామ రూరల్:ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయడంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు విమర్శించారు. నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాలకు సంబంధించి 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని మాగల్లులో కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ నివాసంలో బుధవారం నిర్వహించారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. మహిళా శక్తి పథకం కింద ప్రతి మహిళకు నెలకి రూ.1500 ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నాయకులు, నేడు ఆ పథకం అమలుకు రాష్ట్రాన్ని అమ్మాల్సిన పరిస్థితి ఉందంటూ వ్యాఖ్యానిస్తుండటం గర్హనీయమన్నారు. ఎన్నికల హామీలను అమలుచేయకుండా సీఎం చంద్రబాబు..విద్యార్థులు, మహిళలు, యువత, రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వహయాంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేసిన వైనాన్ని గుర్తుచేశారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సూపరిపాలన పేరుతో కూటమి నాయకులు చేస్తున్న హడావుడిపై ప్రజలకు అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సూపర్‌సిక్స్ పథకాల కోసం ప్రజల తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీబీ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, నాయకులు దేవినేని రామారావు, మేడా కోటేశ్వరరావు, జిల్లేపల్లి రాము, గుంటి ఆశాజ్యోతి, దేవినేని నాగేశ్వరరావు, చెరుకూరి రమేష్, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

క్లుప్తంగా

ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు వినతి



జగ్గయ్యపేట అర్బన్: వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం జగ్గయ్యపేట నుంచి విజయవాడలోని నున్న వరకు వాహనదారులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హాను కోరారు. ఈమేరకు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హాను బుధవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ప్రతి వాహనదారుడు జగ్గయ్యపేట నుంచి విజయవాడలోని నున్న వెళ్లాల్సి రావడంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారన్నారు. డ్రైవర్ల జీతాలు, ఆయిల్ ఖర్చుల కారణంగా వాహనదారులపై ఆర్థికభారం పడుతుందని కమిషనర్‌కు వివరించానన్నారు. సమస్యను సంబంధిత అధికారులతో చర్చించి తగినచర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారనట్లు ఎమ్మెల్యే తెలిపారు.

శాకంబరీ అలంకారంలో అమ్మవారు



జగ్గయ్యపేట: పట్టణంలోని బ్రాహ్మణబజారులో వేంచేసియున్న కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో పార్వతీ అమ్మవారు శాకంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి బుధవారం పలురకాల కూరగాయలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 477.4 మి.మీ వర్షపాతం


నందిగామరూరల్:నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో మంగళవారం 477.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఉపగణాంకాధికారి ప్రసాద్ బుధవారం తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 249.8 మి.మీ వర్షం కురవగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 227.6 మి.మీల వర్షపాతం కురిసినట్లు వివరించారు. వత్సవాయి మండలంలో అత్యధికంగా 138.2 మి.మీ వర్షం కురిసింది. నందిగామ మండలంలో 79.6 మి.మీలు, కంచికచర్ల మండలంలో 68.2 మి.మీలు, చందర్లపాడు మండలంలో 25.6 మి.మీ, వీరులపాడు మండలంలో 76.4 మి.మీ, జగ్గయ్యపేట మండలంలో 25.2 మి.మీ, పెనుగంచిప్రోలు మండలంలో 64.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు ఆయన వివరించారు.

ఈత పోటీల్లో ప్రతిభచూపిన విద్యార్థి



నందిగామరూరల్: స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారని కాకతీయ విద్యాసంస్థల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి కీర్తన్ 50మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో బంగారు పతకం, 50 మీటర్ల బటర్‌ఫ్లై వెండి పతకం సాధించినట్లు వివరించారు. విద్యార్థి కీర్తన్, స్విమ్మింగ్ కోచ్ గోపీచంద్‌ను బుధవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాపా భారతి, కార్తికేయ, స్ఫూర్తి, సుష్మ, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి అన్నాభిషేకం



జగ్గయ్యపేటఅర్బన్: మాసశివరాత్రి సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయఅర్చకులు మురళి పర్యవేక్షణలో శివునికి పంచామృత అభిషేకాలు, అన్నాభిషేకం నిర్వహించారు. చౌడవరపు మల్లికార్జునరావు, భక్తులు పాల్గొన్నారు.

రేపు కౌలు వేలం

జగ్గయ్యపేట:మండలంలోని తిరుమలగిరి గ్రామంలో సర్వే నెంబరు 163/1లోని 9.30 ఎకరాల భూమికి ఈ నెల 25న బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ బుధవారం తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కౌలువేలంలో పాల్గొనదలచినవారు ముందుగా దరావత్ కింద రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పంటలకు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు



వీరులపాడు మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని తహసీల్దార్ ఎ.శాంతిలక్ష్మి తెలిపారు. మండలంలోని ముచ్చింతాల, గుమ్మడిదుర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలు ఎవరికైనా అవసరమైతే రైతుసేవా కేంద్రాల ద్వారా తీసుకోవచ్చన్నారు. ఏఓ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఈ–క్రాప్ నమోదు పూర్తయితేనే పంటల బీమా వర్తిస్తుందని వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు, పశువుల ఎరువులు, వర్మీకంపోస్టు, వేపపిండి, వేప కషాయాలు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.శ్రీను, సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: జీవన ఎరువుల వాడకం ద్వారా నేల సంరక్షణతోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని మండల ప్రత్యేకాధికారి సుభాని, వ్యవసాయాధికారి జోగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పొన్నవరం, నరసింహారావుపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ వినియోగించాలని రైతులకు సూచించారు. తైవాన్ స్ప్రేయర్లు, , యాంత్రీకరణ పరికరాలు, కిసాన్ డ్రోన్‌లను సబ్సిడీపై అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, డీహెచ్‌వో బాలాజీ, వెటర్నరీ డీడీ వెస్లీ, వీఏఏలు గోపి, అనూష, రైతులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలంటూ ధర్నా



చందర్లపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

నందిగామటౌన్(చందర్లపాడు): ఉపాధి హామీ పథకం కూలీలకు వెంటనే బకాయిలను చెల్లించాలని రైతుకూలీ సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించడంతో పాటు హాజరు నమోదులో జరిగిన అక్రమాలపై జిల్లా పీడీతో బహిరంగ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో చందర్లపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీలకు జాబ్ కార్డులను పునరుద్ధరించాలన్నారు. హాజరు నమోదులో అక్రమాల కారణంగా కొడవటికల్లు, పొక్కునూరు గ్రామాలలో కూలీలు తీవ్రంగా నష్టపోయారని వివరించారు.రోజువారి హాజరు, వేతన చెల్లింపులను జాబ్ కార్డులో విధిగా నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరి, గుర్నాథం, కొండ పాల్గొన్నారు.

మునేరులో ఎన్డీఆర్ఎఫ్ గాలింపు చర్యలు



వేములపల్లి మున్నేటిలో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సభ్యులు

కంచికచర్ల/వీరులపాడు: వీరులపాడు మండలం తాటిగుమ్మి వైరా ఉపనదిలో మంగళవారం చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం కంచికచర్ల మండలం వేములపల్లిలో ఎన్డీఆర్ఎఫ్ బృందం బుధవారం గాలింపుచర్యలు చేపట్టింది. తాటిగుమ్మి గ్రామానికి చెందిన నాగార్జున తిరుపతిరావు(30) తన స్నేహితుడు సాగర్‌తో కలసి మంగళవారం మధ్యాహ్న సమయంలో చేపలు పట్టేందుకు గాలాలు తీసుకుని గ్రామ సమీపంలోని వైరా ఉపనదికి వెళ్లారు. అయితే వైరా ఉపనదికి వరదనీరు చేరడంతో తిరుపతిరావు కాలు జారి ప్రమాదవశాత్తు వైరా ఉపనదిలో పడ్డాడు. దీంతో పక్కనే ఉన్న సాగర్ విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు. వారు నదిలో వెతికినా ఆచూకీ లభ్యంగాకపోవడంతో వెంటనే రెవెన్యూశాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందజేశారు. అధికారులు ఎన్డీఆర్ఎఫ్ బృందానికి సమాచారం తెలియజేయడంతో వారు బుధవారం ఉదయం వచ్చి తాటిగుమ్మి వైరా ఉపనదిలో గాలించారు. అనంతరం కంచికచర్ల మండలం కీసర, పెండ్యాల, వేములపల్లి మున్నేటిలో సాయంత్రం వరకు గాలింపు చర్యలు చేపట్టినా తిరుపతిరావు ఆచూకీ లభ్యం కాలేదు. గాలింపు చర్యలు గురువారం కూడా కొనసాగుతాయని ఎన్డీఆర్ఎఫ్ అధికారులు తెలిపారు. గాలింపు చర్యలను సర్పంచ్ పలకా మోహన్‌రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎన్డీ ఆర్ఎఫ్ ఆర్ఎస్ఐ ప్రశాంత్, ఎస్ఐ అనిల్, డీటీ నాగరాజు పర్యవేక్షించారు.

620 మందికి వైద్య పరీక్షలు



విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ రత్నప్రియదర్శని, లయన్స్ క్లబ్ సభ్యులు



విద్యార్థికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ శేషుకుమారి

జగ్గయ్యపేటఅర్బన్: ఆయుష్‌శాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బలుసుపాడు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ వై.రత్న ప్రియదర్శిని, డాక్టర్ ఎస్.కవిత, డాక్టర్ విష్ణువర్ధన్, వారి వైద్య బృందం కలిసి మొత్తం 620 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. వారిలో220 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి రూ.50వేల విలువైన మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయుష్ అధికారి డాక్టర్ రత్నప్రియదర్శిని మాట్లాడుతూ బాలికలు ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. తొలుత విద్యార్థినులచే యోగామాస్టర్లు అశ్విని, కృష్ణవేణి యోగాసనాలను చేయించారు. ఈ వైద్యశిబిరాన్ని గురుకుల ప్రిన్సిపాల్ కొండపల్లి లక్ష్మీసుజాత ప్రారంభించగా, లయన్స్ క్లబ్ కార్యదర్శి షేక్ ఖాసింసైదా, క్లబ్ ప్రతినిధులు జి.నారాయణరెడ్డి, కె.అమరనాథ్, ఎస్‌వీవీ.సత్యనారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషుకుమారి మాట్లాడుతూ కంటి సంబంధిత ఇబ్బందులు ఎదురైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 110 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 14 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామని, వారికి త్వరలోనే కళ్లజోళ్లను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఏఎన్ఎం పద్మ, ప్రియాంక, దేవి, ప్రమీల పాల్గొన్నారు.

నేడు సమీక్షా సమావేశం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని కేవీకేలో గురువారం ఉదయం 10 గంటలకు విజన్–2047పై నియోజకవర్గస్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నితిన్ బుధవారం తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలాజీకుమార్, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ వివరించారు. గ్రామాల వారీగా ఆచరణ ప్రణాళికలపై సమీక్ష ఉంటుందని తెలిపారు.